క్లుప్తంగా

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీలో ఆశీనులు గావించి స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకారపూజ, హారతిపూజల అనంతరం ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



కోళ్లబావాపురంలో నాటుసారా స్థావరాలపై దాడులు చేస్తున్న పోలీసులు

నందికొట్కూరు రూరల్: మండలంలోని బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కోళ్లబావాపురం గ్రామంలో నాటుసారా స్థావరాలపై శుక్రవారం దాడులు నిర్వహించినట్లు రూరల్ సీఐ విజయభాస్కర్ తెలిపారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా మిడుతూరు ఎస్ఐ జగన్ మోహన్, ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున, బ్రాహ్మణకొట్కూరు పోలీసుల ఆధ్వర్యంలో కోళ్లబావాపురం గ్రామంలోని నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించి 70 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

నాటుసారా తయారు చేస్తే కేసులు

నందికొట్కూరు: నాటుసారా తయారు చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని నీలిషికారిపేటలో నాటుసారా తయారు స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఎస్ఐలు హుసేన్‌బాషా, సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: బైర్లూటి చెక్‌పోస్టు సమీపంలోని అడవిలో రహస్యంగా నిర్వహిస్తున్న నాటుసారా బట్టీలపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. సిద్దాపురం గ్రామానికి చెందిన దయ్యాల నాగరాజు నిర్వహిస్తున్న బట్టి వద్ద 18 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, 10 ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన రెండువేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.సీఐ నాగభూషణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో ఎస్ఐ నారాయణ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్నకు నృత్య నీరాజనం



నృత్యం చేస్తున్న కళాకారిణులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై మార్కాపురానికి చెందిన స్నేహ సంగీత నాట్య అకాడమీ వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో మహాగణపతిం, ఓం నమఃశివాయా, లింగాష్టకం, శివపంచాక్షరి స్తోత్రం, దేవీస్తుతి, అర్ధనారీశ్వర శతకం, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు, అష్టకాలకు గాయత్రి, దీపిక, లిఖిత, తేజశ్రీ, భవ్యశ్రీ తదితరులు నృత్యం చేశారు.

మట్టి తవ్వకాలను అరికట్టండి

జూపాడుబంగ్లా: ప్రభుత్వ భూముల్లో అనుమతుల్లేకుండా అక్రమంగా మట్టిని తవ్వుతున్న కాంట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు కోరారు. శుక్రవారం ఆయన మండ్లెం గ్రామం వద్ద అక్రమంగా మట్టిని తరలిస్తున్న పీఎస్‌కే టిప్పర్లను అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ మామూళ్ల మండ్లెం, తంగడంచ, తరిగోపుల రెవెన్యూ గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తవ్వుతున్నా పట్టించుకోకపోవటం దారుణమన్నారు. అలాగే మండ్లెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట నేషనల్‌హైవే అధికారులు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు.

వివేకానంద జయంతి

పాములపాడు: స్థానిక వివేకానంద విద్యా విహార్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా కరస్పాండెంట్ ఆర్ఎస్ఆర్ గోపాల్, ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రికార్డులు లేకుండా విధులా?

జూపాడుబంగ్లా: ఆరోగ్య ఉపకేంద్రాల్లో సక్రమంగా రికార్డులు నిర్వహించకుండా సిబ్బంది విధులు నిర్వహించటం సరికాదని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వహాబ్ తెలిపారు. శుక్రవారం 80బన్నూరు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించగా మూవ్‌మెంట్ రిజిష్టర్ లేకపోవటం, ఉపకేంద్రం నిర్వహణకు సంబంధించిన రికార్డుల్లేవని అక్కడి వైద్య సిబ్బంది సమాధానం ఇవ్వటంతో ఆయన ఖంగుతిన్నారు. రికార్డుల్లేకుండా ఎలా విధులు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



పాములపాడులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కొత్తపల్లి: క్రీడలతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంపీడీఓ మేరి సూచించారు. శుక్రవా రం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మూడవ రోజు ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు కొనసాగాయి. ఖోఖో పోటీల్లో ముసలమడుగు జట్టు, బ్యాడ్మింటన్ పోటీల్లో దుద్యాల విజయం సాధించి నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యాయన్నారు.

పగిడ్యాల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఖోఖో, క్రికెట్ మ్యాచ్‌లు 14 నిర్వహించగా లక్ష్మాపురం 2 మహిళా జట్టు, పాత ముచ్చుమర్రి బాలుర జట్టు సెమీ ఫైనల్ పోటీల్లో నెగ్గి విజేతలుగా నిలిచారు. సెమీ ఫైనల్ క్రికెట్ పోటీల్లో పగిడ్యాల 3, నెహ్రూనగర్ 2 జట్లు ఫైనల్‌కు చేరాయని ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఇరుజట్లు శనివారం జరిగే ఫైనల్ పోటీలో పాల్గొంటాయన్నారు. బాల్‌బాడ్మింటన్ పోటీల్లో పురుషుల విభాగంలో పగిడ్యాల-1 జట్టు, మహిళల విభాగంలో పగిడ్యాల-3 జట్లు విజేతలుగా నిలిచారు. వాలీబాల్ పురుషుల విభాగంలో పాతముచ్చుమర్రి, మహిళల విభాగం నుంచి నెహ్రూనగర్ 2 జట్లు గెలుపొందారు. కబడ్డీలో పురుషుల విభాగంలో లక్ష్మాపురం-2 జట్టు, మహిళల విభాగంలో పగిడ్యాల-1 జట్టు నియోజకవర్గ పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ వివరించారు.

మిడుతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మిడుతూరు, మాసపేట జట్ల మధ్య జరిగిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో మిడుతూరు జట్టు విజయం సాధించినట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ ఇన్‌చార్జ్, వ్యాయమ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు.

పాములపాడు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు శుక్రవారం స్థానిక ఏఎస్ఆర్ క్రీడా మైదానంలో హోరాహోరగా సాగాయి. పోటీలను ఎంపీడీఓ గోపీకృష్ణ, ఎంఈఓ సుభాషిణి ప్రారంభించారు. కబడ్డీలో మిట్టకందాల, ఇస్కాల మధ్య జరిగిన ఫైనల్ పోరులో మిట్టకందాల విజయం సాధించింది. ఖోఖో ఇస్కాల ఫైనల్‌కు చేరింది. క్రికెట్‌లో మిట్టకందాల, వేంపెంట గ్రామాలు ఫైనల్‌కు చేరాయి. 17వ తేదీన ఫైనల్ పోటీ ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు.

వెలుగోడు: స్థానిక ఉన్నత, లిటిల్ ఏంజిల్స్ పాఠశాల, వేల్పనూరు హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో పలు జట్లు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. క్రికెట్‌లో వెలుగోడు-4 సచివాలయం విజేతగా నిలిచింది. కబడ్డీ పురుషుల విభాగం రేగడగుడురు-2 సచివాలయం, మహిళల విభాగంలో వెలుగోడు2, వాలీబాల్‌లో వెలుగోడు-4వ, బ్యాడ్మింటన్ పురుషులలో వెలుగోడు-3 సచివాలయం, మహిళల విభాగంలో వెలుగోడు-3 సచివాలయం, ఖో ఖో పురుషులులో వెలుగోడు-4, మహిళల విభాగంలో వెలుగోడు3 జట్లు గెలుపొందాయి. గెలిచినటీంలు నియోజకవర్గ స్థాయిలో పోటీలు ఈనెల 24 నుంచి 30 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటాయని ఎంఈవో బ్రహ్మంనాయక్ తెలిపారు.



టాస్‌వేసి బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ మేరి



తాలూకా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఈఓపీఆర్డీ, పీఈటీలు

జూపాడుబంగ్లా: మండలస్థాయిలో సత్తాచాటి జూపాడుబంగ్లా-1, 2 సచివాలయాల జట్లతో పాటు తూడిచెర్ల జట్టు తాలూకా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రికెట్, ఖోఖో, వాలీబాల్ ఫైనల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. క్రికెట్ పోటీలో జూపాడుబంగ్లా-1 పై జూపాడుబంగ్లా-2 జట్టు నెగ్గింది. వాలీబాల్ పోటీల్లో జూపాడు బంగ్లా-1 జట్టు తరిగోపుల సచివాలయం జట్టుపై గెలుపొందింది. ఖోఖో పోటీల్లో తూడిచెర్ల సచివాలయం జట్టుపై పారుమంచాల సచివాలయం జట్టు విజయం సాధించింది



విజయం సాధించిన జట్టుతో అధికారులు



ఖోఖో విజేత లక్ష్మాపురం 2 జట్టును అభినందిస్తున్న అధికారులు, నాయకులు



క్రికెట్ విజేత మిడుతూరు జట్టు



ఖోఖో విజేత ముసలిమడుగు జట్టు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహానంది: రెండవ శనివారము సందర్భంగా నేడు బండిఆత్మకూరు, సంతజూటూరు, ఈర్నపాడు సబ్ స్టేషన్లలో మరమ్మతులు, 33 కేవీ లైన్ మరమ్మతులు చేస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. దీంతో బండిఆత్మకూరు మండలంలో ఉదయం 9:00 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెలుగోడు: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవీంద్ర నాయక్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. మండలంలోని అన్ని సబ్ స్టేషన్లలో నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

నాలుగు సెల్‌ఫోన్లు చోరీ

జూపాడుబంగ్లా: స్థానిక వారాంతపు సంతలో ప్రతి వారం సెల్‌ఫోన్లు చోరీకి గురవుతుండటతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం జరిగిన వారాంతపు సంతలో కూడా నాలుగు సెల్‌ఫోన్లు చోరీకి గురికావటంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తాటిపాడు గ్రామానికి చెందిన దొరస్వామి, సుధాకర్, ఖురేష్‌తో పాటు మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్వర్లుకు చెందిన సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. కూరగాయలు కొనుగోలు చేసే సమయంలో పై జేబులో ఉంచుకొన్న సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేశారని వారు పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

మిడుతూరు: నాగలూటి గ్రామ ఎస్సీ కాలనీలో ఉపాధి హామీ పథకం కింద రూ. 5 లక్షలతో రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి భూమి పూజ చేశారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



గాజులపల్లెలో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

మహానంది: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని, రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం జగన్ అహర్నిశలు శ్రమిస్తున్నారని రాష్ట్ర శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. గాజులపల్లె, బుక్కాపురం, అబ్బీపురం గ్రామాల్లో శుక్రవారం రూ.1.20కోట్లతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు,సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభించారు. నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా జగనన్న ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అందులో భాగంగానే గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రూ.కోట్లు ఇచ్చి వెచ్చించి పనులు చేస్తుంటే గ్రామాల్లో అభివృద్ధి జరగడం లేదంటూ ప్రతిపక్ష నేతలు ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద జరుగుతున్న కార్తీక్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో క్రికెట్ ఆడి యువకుల్లో ఉత్సాహం నింపారు. అలాగే ఆడదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీనరసమ్మ, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వర్ రెడ్డి, గోపవరం సొసైటీ చైర్మన్ గాజులపల్లి కిట్టు, గాజులపల్లె సీనియర్‌నేత కొండా మధుసూదన్‌రెడ్డి, సర్పంచులు గడ్డం చంటి, కందుల వరలక్ష్మమ్మ, శవ్వాశ్రీలక్ష్మీ, సలహా మండలి చైర్మన్ శరభారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఒంటిద్దు వీరారెడ్డి, బీసీ విభాగం నాయకులు గజ్జ పక్కీరయ్య, లక్ష్మీనాథరెడ్డి, పాల్గొన్నారు. అలాగే బండిఆత్మకూరు మండలం జీసిపాలెం గ్రామానికి చెందిన షేక్‌నబిరసూల్ కుమార్తె విషజ్వరంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే రూ.10వేల అందజేశారు.



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ప్రజల ఆరోగ్యం కోసమే 'జగనన్న ఆరోగ్య సురక్ష'



జూపాడుబంగ్లాలో ఓపీ కోసం బారులు



అల్లూరులో మహిళకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

నందికొట్కూరు రూరల్ : ప్రజల ఆరోగ్యం కోసమే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని వైస్ ఎంపీపీ కట్టా మంజుల పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అల్లూరు గ్రామంలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సంజన్న, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వైద్యు లు అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా 500 మంది ఓపీ తీసుకోగా 480 మంది 14 రకాల వైద్య సేవలు పొందారు.

జూపాడుబంగ్లా: ప్రజారోగ్య రక్షణ కోసమే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తుందని ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీడీఓ నూర్జహాన్, సర్పంచ్ మొట్టిబాల స్వామి, ఎంపీటీసీ మోతె వెంకటమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సచివాలయం-2 ఆవరణలో సర్పంచ్ అధ్యక్షతన జగనన్న ఆరోగ్యసురక్ష రెండో విడత ఆరోగ్యశిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం వృద్ధులకు ఉచితంగా కంటిఅద్దాలు పంపిణీ చేశారు. ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి, వైద్యులు డాక్టర్ సభా, సీహెచ్ఓ వహాబ్, హెల్త్‌సూపర్‌వైజర్లు రాముడు, విజయలక్ష్మమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామంలో సర్పంచ్ పెద్ద ఆంజనేయులు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడుత క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. 571 మంది రోగులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. కంటి సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న 60 మందిలో 34 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామని వైద్యాధికారి మోహన్ తెలిపారు. ఇద్దరిని ఆరోగ్యశ్రీ కింద కర్నూలుకు రెఫర్ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, డాక్టర్లు ప్రసన్నలక్ష్మీ(గైనకాలజిస్టు), అనంతయా దవ్(సర్జన్), అనిల్‌కుమార్, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మీ, సీహెచ్ఓ గుర్రప్ప, హెల్త్‌సూపర్‌వైజర్ శివగౌరీ, పంచాయతీ కార్యదర్శి జావేద్ పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా దుకాణాల వేలం

కొత్తపల్లి: కొలను భారతీ క్షేత్రంలో ఏటా దుకాణాల నిర్వహణకోసం సంబంధిత అధికారులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తారు. ఈ ఏడాది 2024-2025 సంవత్సరానికి శుక్రవారం ఆలయ ఈఓ మోహన్, నంద్యాల తనిఖీ అధికారి శశికుమార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించగా పాటదారులు ముందుకు రాలేదని అధికారులు తెలిపారు. అయితే వేలాలను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారని భక్తులు, స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది బొమ్మల దుకాణానికి రూ.5వేలు, కూల్‌డ్రింక్స్,ఐస్‌క్రీమ్ అంగళ్లకు రూ.24,500, గాజుల అంగళ్లకు రూ.5వేలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇందులో హోటల్, అమ్మవారి ఫొటోలు, బెల్లం చెరుకుల అంగళ్ల నిర్వహణ కోసం ఏపాటదారుడు ముందుకు రాకపోడంతో వేలం వేయలేదన్నారు. గత ఏడాది బొమ్మల అంగళ్లకు రూ.4,500, కూల్‌డ్రింక్,ఐస్‌క్రీమ్ అంగళ్లకు రూ.2,200, గాజుల అంళ్లకు రూ.4500 వచ్చాయి. ఈఏడాది అన్నింటిపై కేవలం వందల రూపాయాల్చ్‌లో అదా యం రావడంపై భక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు

వెలుగోడు: మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ లాలం రమేష్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ లాలం రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ చికెన్‌బాబు, పలువురు సభ్యు లు అధికారుల తీరును తప్పుపట్టారు. ప్రతి సమావేశంలో సమస్యలపై చర్చించడమే తప్ప ప్రగతి నివేదికలు చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరినా స్పందనలేదన్నారు. అలాగే కొన్ని గ్రామాలకు సక్రమంగా బస్సులు రాకపోవడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బదులు పడుతున్నారన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్రా, జగనన్న సురక్ష కార్యక్రమాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ఈవోఆర్డీ , జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్,ఎంఈవో బ్రహ్మంనాయక్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, విద్యుత్ ఏఈ రవీంద్రనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పక్కీరయ్య, సర్పంచ్ వేల్పుల జయపాల్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారిణి లక్ష్మీప్రసన్న

చెంచు కాలనీల్లో వసతుల కల్పనకు కృషి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని జీసి పాలెం, నెమళ్లకుంట చెంచుకాలనీల్లో వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎంపీడీఓ వాసుదేవ గుప్తా తెలిపారు. శుక్రవారం ప్రధానమంత్రి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ఉపసర్పంచ్ లింగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ గిరిజనులందరికీ ఇళ్లు, ఇంటింటికీ మంచి నీటి కుళాయి, రోడ్లు, విద్యుత్ సౌకర్యాల ఏర్పాట్లపై చర్చించారు.

14న అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

జూపాడుబంగ్లా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని తరిగోపుల గ్రామంలో ఈనెల 14వ తేదీన అంతర్రాష్ట్ర న్యూ కేటగిరి సైజు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల ఎద్దుల యజమానులు 13తేదీ సాయంత్రం లోగా రూ.600 ప్రవేశ రుసుము చెల్లించి పేర్లు నమోదుచేయించు కోవాలని సూచించారు. గెలుపొందిన వృషభాలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. వివరాలకు సెల్ 986686123, 9676267 969 నంబర్లను సంప్రదించాలని కోరారు.

శ్రీగిరికి సంక్రాంతి శోభ



ఆలయ ధ్వజస్తంభానికి పుష్పాలంకరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శుక్రవారం సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల ఆలయాన్ని దేవస్థానం అధికారులు సుందరంగా అలంకరించారు. ఆలయంలోని ధ్వజస్తంభం, స్వామిఅమ్మవార్ల ఆలయాలను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అలాగే ఆలయ గోపురాలకు, గంగాధర మండపం వద్ద ప్రధాన ఆలయానికి ఎదురుగా స్వామిఅమ్మవార్ల చిత్రపటాలతో విద్యుద్దీకరణ చేయించారు. ఆలయంలో పుష్పాలంకరణ, ఆలయం వెలుపల విద్యుద్దీకరణ భక్తులను అకట్టుకుంది. దీంతో శ్రీగిరి క్షేత్రం సంక్రాంతి శోభ ఉట్టిపడుతోంది.

క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీశైలం: శ్రీశైల క్షేత్రంలోని అఖిలభారత నాయీబ్రాహ్మణ అన్నదానసత్రంలో 2024 మహాశివరాత్రి కార్యకర్తల సమావేశం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి కార్యక్రమాల గురించి చర్చించి , 2022, 2023 సత్రం జమ ఖర్చు ఆడిట్ రిపోర్ట్‌ను ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు శివయ్య వివరించారు.అనంతరం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సత్రం అధ్యక్షుడు ఆదినారాయణ, క్యాషియర్ పోలీశ్వరరావు, సత్ర కమిటీ సభ్యులు, రాఘవేంద్ర, మద్దిలేటి, మహాశివరాత్రి ప్రచార కార్యకర్తలు పాల్గొన్నారు.

వందశాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి

వెలుగోడు: మండలంలో ఈ-క్రాప్ నమోదు వందశాతం పూర్తి చేసి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచామని మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్బీకేలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. ప్రతి రైతు భరోసా కేంద్రంలో జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. రబీలో జొన్న పంట సాగు చేసిన రైతులకు కొనుగోలు కేంద్రాల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. ఎఫ్ఏక్యు నార్మ్స్ ప్రకారం కొనుగోలు చేపట్టాలని, రవాణా ఖర్చులు, గోనె సంచులు, హమాలీ ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు.డీసీఎంఎస్ మేనేజర్ మౌలాలి, ఏఈఓ సుధారాణి పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

పగిడ్యాల: తూర్పు, పడమర ప్రాతకోట గ్రామాల్లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గంగా పార్వతీ నాగేశ్వరస్వామి, అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర, నందీశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా వివిధ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈనెల 13వ తేదీన ఉదయం 9 గంటలకు ముగ్గుల పోటీలు, సాయంత్రం 5 గంటలకు షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయన్నారు. పాల్గొనే క్రీడాకారులు రూ. 100 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే 14న ట్రాక్టర్ రివర్స్ గేర్ పందెం, మధ్యాహ్నం 4 గంటల నుంచి రెండు పళ్ల పొట్టేలు పోటీ లు ఉంటాయన్నారు. 15న ఉదయం 10 గంటలకు అంతర్రాష్ట్ర న్యూ కేటగిరి వృషభాల బండలాగుడు పోటీలు ఉంటాయని ఎంట్రీ ఫీజు రూ. 600 చెల్లించాలని చెప్పారు. రాత్రికి కూచిపూడి, భరత నాట్య ప్రదర్శన ఉంటుందన్నారు. 16న పొట్టేళ్ల పందెం, అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు ఉంటాయని ఎంట్రీ ఫీజు రూ. 200 చెల్లించాలని కోరారు. తూర్పు ప్రాతకోటలో 16న అంతర్రాష్ట్ర 4 పళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయని ఎంట్రీ ఫీజు రూ. 500 చెల్లించాలని కోరారు.

15న రథోత్సవం: ఈనెల 15న నాగేశ్వరస్వామి, అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర, నందీశ్వరస్వామిల రథోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 13న బండి సేవ, 14న కల్యాణోత్సవం, ప్రభోత్సవం, 15న రథోత్సవం, 16న పారువేట, 17న వసంతోత్సవంతో ముగుస్తాయని అంబటి శివశంకర్‌రెడ్డి తెలిపారు.

మహారాజశ్రీ నంద్యాల రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.A.NO. 26/2022 IN E.P. No. 67/2016 IN O.S.No. 147/2012

బైరెడ్డి సుబ్బారెడ్డి .. అర్జీదారుడు

Versus

1. భీమిశెట్టి నాగేశ్వరయ్య (D.Hr. IN E.P. 67/2016 IN O.S. No. 147/2012)
2. పోతుల ఓబన్న J.Dr. ...రెస్పాండెంట్స్
3. ఎ.వెంకటనాగ రాజా ప్రసాద్ (Auction Purchaser) (IN E.P. 67/2016 IN O.S.No. 147/2012)

రెస్పాండెంట్ నెం. 2 అడ్రస్: పోతుల ఓబన్న తండ్రి ఓబులేసు, వయస్సు 40 సం॥, వ్యవసాయం, R/o రామాపురం గ్రామం, బండిఆత్మకూరు మం, నంద్యాల జిల్లా.

R2 (J.Dr) నోటీసు

పై తెలిపిన అమలు అర్జీలో అర్జీదారుడు అయిన బైరెడ్డి సుబ్బారెడ్డి అను అతను మీ పైన వేలము జరిగిన మొత్తము అనగా రూ. 12,00,000/- లు (పన్నెండు లక్షలు) మొత్తములో నుండి దామాషా ప్రకారము తనకు రావలసిన డబ్బును ఇప్పించవలసినదిగా పైకోర్టు వారిని కోరుతూ E.A. No. 26/2022 దాఖలు చేసినందున పై విషయంలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో తేది 22.01.2024 ఉదయం గం. 10.30 నిమిషాలకు పై కోర్టు ఎదుట హాజరై మీరు కానీ మీ తరపు న్యాయవాది కానీ మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు సదరు దామాషా అర్జీని తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
కోర్టులో వాయిదా తేది 22.01.2024, ఉదయం గం 10.30 ని.కు కోర్టు వారు ఉత్తర్వుల మేరకు

ఇట్లు పి.వి.సుబ్బారెడ్డి, యన్.సుదర్శన్ రెడ్డి, న్యాయవాదులు, నంద్యాల. సెల్: 99497 37333

మహారాజశ్రీ నంద్యాల రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.A.NO. 27/2022 IN E.P. No. 67/2016 IN O.S.No. 147/2012

భీమిశెట్టి నాగ సుంకయ్య .. అర్జీదారుడు

Versus

1. భీమిశెట్టి నాగేశ్వరయ్య (D.Hr. IN E.P. 67/2016 IN O.S. No. 147/2012)
2. పోతుల ఓబన్న J.Dr. ...రెస్పాండెంట్స్
3. ఎ.వెంకటనాగ రాజా ప్రసాద్ (Auction Purchaser) (IN E.P. 67/2016 IN O.S.No. 147/2012)

రెస్పాండెంట్ నెం. 2 అడ్రస్: పోతుల ఓబన్న తండ్రి ఓబులేసు, వయస్సు 40 సం॥, వ్యవసాయం, R/o రామాపురం గ్రామం, బండిఆత్మకూరు మం, నంద్యాల జిల్లా.

R2 (J.Dr) నోటీసు

పై తెలిపిన అమలు అర్జీలో అర్జీదారుడు అయిన భీమిశెట్టి నాగసుంకయ్య అను అతను మీ పైన వేలము జరిగిన మొత్తము అనగా రూ. 12,00,000/- లు (పన్నెండు లక్షలు) మొత్తములో నుండి దామాషా ప్రకారము తనకు రావలసిన డబ్బును ఇప్పించబలసినదిగా పైకోర్టు వారిని కోరుతూ E.A. No. 27/2022 దాఖలు చేసినందున పై విషయంలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో తేది 22.01.2024 ఉదయం గం. 10.30 నిమిషాలకు పై కోర్టు ఎదుట హాజరై మీరు కానీ మీ తరపు న్యాయవాది కానీ మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు సదరు దామాషా అర్జీని తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
కోర్టులో వాయిదా తేది 22.01.2024, ఉదయం గం 10.30 ని.కు కోర్టు వారు ఉత్తర్వుల మేరకు

ఇట్లు పి.వి.సుబ్బారెడ్డి, యన్.సుదర్శన్ రెడ్డి, న్యాయవాదులు, నంద్యాల. సెల్: 99497 37333
